క్లుప్తంగా

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్



మరిపెడ రూరల్/ డోర్నకల్ : హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలను ప్రభుత్వ చీఫ్ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్ కుటుంబ సమేతంగా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీవారి ప్రసాదాన్ని సీఎంకు అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఏఓ, డీహెచ్ఎస్ఓ

మహబూబాబాద్ రూరల్ : నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఎం.విజయనిర్మల, జి.మరియన్న, ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్



మరిపెడ రూరల్ : పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ గుండెపుడి గ్రామ అధ్యక్షుడు సూరబోయిన ఉప్పలయ్య అన్నారు. మండలంలోని గుండెపుడికి చెందిన పలువురికి సీఎం సహాయనిధి కింద సుమారు రూ.5లక్షల చెక్కులు మంజూరు కాగా గురువారం లబ్ధిదారులకు అందజేశారు. పెద్దపులి శ్రీను, రేఖ శ్రీనివాస్, మల్లేష్, ఉప్పలయ్య, బాబు, వీరన్న, రమేష్, గుండగాని రంగనాథ్, ప్రవీణ్ కుమార్, నరేష్, నాగేంద్రచారి పాల్గొన్నారు.

రూ.20వేల చెక్కు అందజేత



మహబూబాబాద్ : జిల్లా నుంచి సీఎం కప్ క్రీడాపోటీలకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల కోసం ట్రెసా యూనియన్ నాయకులు గురువారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను కలిసి రూ.20వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్, మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ట్రెసా జనరల్ సెక్రటరి ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పెద్దవంగర : ఉప్పరగూడెం గ్రామపంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న బైన రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా గురువారం మండలంలోని పలు గ్రామాల కారోబార్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జమ చేసి రూ16,500 నగదును కుటుంబీకులకు అందజేశారు. కారోబార్లు గిరగాని రామస్వామి, పరశురాములు, శ్రీకాంత్, మధుకర్, కళ్యాణ్, పాషా, సతీష్, లక్ష్మణ్, ఎల్లమ్మ, ఉప్పలయ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన



మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలక మలుపు అని, వందశాతం ఉత్తీర్ణతపై విద్యార్థులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సైకాలజి నిపుణుడు డాక్టర్ ఉమ్మగిని అరుణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో టెలిమానస్ కార్యక్రమంలో భాగంగా గురువారం అరుణ్ కుమార్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సదానందం, కుమార్, స్వాతి, ఫర్వీనా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



డోర్నకల్ : గన్యా తండాకు చెందిన గర్భిణి మాలోత్ పద్మ గురువారం 108 అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చింది. పద్మకు పురిటి నొప్పులు రావడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మున్నేరువాగు వద్ద సాధారణ ప్రసవం ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ సలీమా తల్లిబిడ్డలకు పరీక్షలు నిర్వహించిన అనంతరం పీహెచ్‌సీకి తరలించారు.

అగ్నికర్మ వైద్యానికి ఆదరణ

- ఆయుర్వేదంలో నూతన పద్ధతి
- మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

కురవి : పూర్వ కాలం నుంచి ఆయుర్వేద వైద్యానికి మంచి గుర్తింపు ఉంది. మండలంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో అందజేస్తున్న ఆయుర్వేద వైద్యానికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. రోజు సుమారు 30 నుంచి 40 మంది వరకు వివిధ రోగాలతో బాధపడుతూ వైద్యం కోసం దూరప్రాంతాల నుంచి వస్తున్నారు. కీళ్లనొప్పులు, వాతం, వాపులకు ఆయుర్వేద వైద్యురాలు వసుంధరదేవి చికిత్స చేస్తున్నారు. విద్ధకర్మ, అగ్నికర్మ వైద్యం అందజేస్తుండడంతో రోగాలు నయమై ఆశలు చిగురిస్తున్నాయి. కీళ్లనొప్పులు, వెన్నుపూస, మెడ నొప్పులు, వాత వ్యాధులు, పెరాలసిస్, కాళ్లు, మోకాళ్లలో వాపులకు అగ్నికర్మ వైద్యం అందిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం రోగులు క్యూ కడుతున్నారు. నొప్పులున్న ప్రదేశంలో సన్నటి సూదిలాంటి పరికరంతో కొవ్వొత్తిని మంటగా వెలిగించి నొప్పి ఉన్న చోట వేడితో గుచ్చడంతో నొప్పి నయమవుతోంది. దీంతో ప్రతి రోజు వైద్యం కోసం ఆస్పత్రికి రోగులు వస్తున్నారు. రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేస్తున్నారు. అగ్నికర్మ వైద్య పద్ధతిలో 2021లో శిక్షణ తీసుకోవడం జరిగిందని వైద్యురాలు వసుంధర దేవి తెలిపారు. అగ్నికర్మ పద్ధతితో వంద రోగాలను సులువుగా నయం చేయవచ్చని ఆమె వివరించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తే మరింత ఆదరణ పొందే అవకాశాలున్నాయని రోగులు చెబుతున్నారు.



కురవిలోని ఆయుర్వేద వైద్యశాల



మెడనొప్పికి అగ్నితో వైద్యం చేస్తున్న వైద్యురాలు

ఎస్సీ వర్గీకరణతోనే న్యాయం

నెహ్రూసెంటర్ : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓసీ క్లబ్‌లో సంఘం, మాదిగ కళాకారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో వర్గీకరణ చేయకుండా కాలయాపన చేయడంతో మాదిగలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వర్గీకరణ సాధనకు ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుల మహా ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొమిరే వెంకన్న, దర్శనం యుగేందర్, నరేష్, చారు జిన్న, బండ వెంకన్న, అశ్విని, కె.సత్యనారాయణ, కవిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీరయ్య

నేడు సావిత్రిబాయి జయంతి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ నెల 3వ తేదీ(శుక్రవారం) సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను కలెక్టర్ ఆదేశానుసారంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. విద్యార్థులకు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చరిత్రను తెలియజేయాలన్నారు. తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

బహుజన వీరుడు మొగిలయ్య



నెహ్రూసెంటర్ : నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన బహుజన వీరుడు బత్తిని మొగిలయ్యగౌడ్ అని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద మొగిలయ్య గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. గౌడ సంఘం జేఏసీ కన్వీనర్ సమ్మెట వెంకన్నగౌడ్, జెర్రిపోతుల వెంకన్న, లింగాల వీరభద్రం, భద్రసేన, గడ్డం సమ్మయ్య, మద్యల శ్రీనివాస్, గండి వీరేందర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం

కొత్తగూడ : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే(హెచ్-143) మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదుల రాజు, ఉపాధ్యక్షుడిగా మంచికట్ల రాము, ప్రధాన కార్యదర్శి మైదం శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా యాదగిరి కిరణ్‌కుమార్, కోశాధికారిగా దేవులపల్లి రాజేశ్వర్, ప్రచార కార్యదర్శిగా ముదురుకోల వెంకన్నను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఎండీ రహమాన్, గుగులోత్ మహేందర్, సంతోష్ పాల్గొన్నారు.

భూమి.. ప్రభుత్వానిదా ప్రైవేటా..

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న భూమి ప్రభుత్వానిదా, ప్రైవేటు భూమినా అని అధికారులు తేల్చాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 677 భూమిని బీఎస్పీ నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ.. మానుకోట పట్టణ నడిబొడ్డులో 4 ఎకరాల్లో సర్వే నంబర్ 677, 682 నుంచి 1,678బీలకు చెందిన భూమిలో ప్రైవేట్ వెంచర్ వుందని, అందులో రెవెన్యూ,మున్సిపల్ నిబంధనల ప్రకారం సుమారు 8 గుంటలు గ్రీన్‌ల్యాండ్ తీసి పట్టణ ప్రకృతి వనం పేరుతో బోర్డును ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఆ బోర్డు ఆనవాలు లేవని, అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వ భూమినా, ప్రైవేట్ భూమినా అని తేల్చాలన్నారు. గుగులోత్ నరేష్ నాయక్, హేమంత్, రమేష్, శ్రీను, చింటు, చందు తదితరులు పాల్గొన్నారు.



భూమిని సందర్శించి మాట్లాడుతున్న శివరాజ్

పేదింటిబిడ్డకు 'గాంధీ'లో పీజీ మెడికల్ సీటు

గార్ల : నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గిరిజన ఆణిముత్యం మాలోత్ సంధ్య హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో పీజీలో జనరల్ మెడిసిన్(ఎండీ) సీటు సాధించింది. మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ దేశ్యా తండాకు చెందిన రైతు మాలోత్ మాన్‌సింగ్-నీలాదేవిల కుమార్తె సంధ్య చిన్ననాటి నుంచే చదువుల్లో దిట్ట. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. గాంధీ మెడికల్ కళాశాలలో పీజీలో జనరల్ మెడిసిన్ సీటు సాధించింది. కుమారుడు సైతం గుంటూరు మెడికల్ కళాశాలలో మెడిసిన్ సీటు సాధించి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భంగా సంధ్యను గార్ల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఎస్సై ఎస్‌కే రియాజ్‌పాషా, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, గుండా వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.



సంధ్య, పీజీ మెడికో విద్యార్థిని

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


మరిపెడ రూరల్ : కుటుంబ కలహాలతో గత నెల 31న గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాయిపాలెంకు చెందిన అనంతగిరి సతీష్ (32) మద్యానికి బానిస కాగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా డిసెంబర్ 31 అతిగా మద్యం తాగి ఇంటికి రాగా భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సతీష్ అదే రోజు రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు 108ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సతీష్ (ఫైల్)

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి..

గార్ల : స్థానిక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు భూక్యా లాలు(40) అనారోగ్యంతో గురువారం గార్లలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. టీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు, తదితరులు లాలు భౌతికకాయంను సందర్శించి సంతాపం ప్రకటించారు.



లాలు (ఫైల్)

బెల్లం పట్టివేత

నర్సింహులపేట : కొమ్ములవంచ శివారు ఊన్యా తండాలో రెండు క్వింటాళ్ల బెల్లం, 10 కిలోల పటికను పట్టుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలోత్ సురేష్ తెలిపారు. గురువారం ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా బైక్‌పై బస్తా వేసుకొని వెళ్తున్న జాటోత్ నరేష్‌ను ఆపి విచారించగా ఇంట్లో రెండు క్వింటాళ్ల బెల్లం, 10 కేజీల పటిక ఉండటంతో సీజ్ చేశామన్నారు. నరేష్, యశ్వంత్, నరేందర్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుమ్మి దగ్ధం

డోర్నకల్ : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు గుమ్మి దగ్ధమైంది. రైల్వే స్టేషన్ సమీపంలోని లక్ష్మిబార్ రోడ్డులో ఓ గుమ్మికి తెల్లవారుజామున నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా సకాలంలో మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

కాపర్ వైరు చోరీ.. గిరిజన రైతుల ఆందోళన

మరిపెడ రూరల్ : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ సంఘటన మరిపెడ మండలం తండ ధర్మారం శివారు వ్యవసాయ క్షేత్రాల్లో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం ప్రకారం.. మండలంలోని తండధర్మారం శివారులోని పలువురు గిరిజన రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటే చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో విలువైన కాపర్ వైరును చోరీ చేశారు. వరి నాట్ల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైర్ చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై మరిపెడ విద్యుత్ శాఖ ఏఈ పావనికి రైతులు తెలియజేయగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మొట్ల తండా గ్రామానికి చెందిన వర్రె మహేష్, మౌనిక దంపతులు ఆస్పత్రికి వచ్చి తమ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి వారు గాయత్రీ గుట్ట సమీపంలోని బంకులో పెట్రోలు పోయించుకుని బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో జమాండ్లపల్లికి చెందిన జుజ్జూరి రఘు తన మిత్రులతో కలిసి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి మహేష్, మౌనిక వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్, రఘు ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లికుదురు/గార్ల : నెల్లికుదురు మండలంలోని ఆలేరు జెడ్పీఎస్ఎస్‌లో ఎంఈఓ రాందాస్, గార్లలో ఎంఈఓ వీరభద్రం గురువారం టీపీటీఎఫ్ నూతన క్యాలెండర్లు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నవీన్, భిక్షపతి, జయప్రకాష్, స్రవంతి, అనిత, నర్సయ్య,టీపీటీఎఫ్ గార్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు పాపావత్ యాదగిరి, బాలాజీనాయక్, శీలంశెట్టి వెంకటేశ్వర్లు, కొండ హనుమంతు, సంతు, తోట రమేష్, అజ్మీరా సామ, ప్రవీణ్‌కుమార్, ఎస్‌కే మీరా, కన్నయ్య, అనిల్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ డైరీ..

మహబూబాబాద్ : టీఎస్ యూటీఎఫ్-2025 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆవిష్కరించారు. నాయకులు ఎస్. మల్లారెడ్డి, మురళీకృష్ణ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్..

నెల్లికుదురు /కేసముద్రం : పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్లను నెల్లికుదురు ఎంఈఓ రాందాస్, ఇనుగుర్తి ఎంఈఓ రూపారాణి గురువారం ఆవిష్కరించారు. ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో పీఆర్‌టీయూ నెల్లికుదురు మండల అధ్యక్షుడు కొత్త నర్సింహారెడ్డి, లక్ష్మణ్, సోమయ్య, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్ధన్, బిక్కు, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు సూరం భాస్కర్, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల రమేష్, వీరన్న, షఫీ, దేవేందర్, రాములు, లక్ష్మీనారాయణ, యాకయ్య, సమ్మిరెడ్డి, సారంగపాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కురవి : పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీఓ ఎండీ గౌస్‌పాషా, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశువుల సంత ఆవరణలో సీఎస్‌సీ నిధులు చేపట్టనున్న సామూహిక మరుగుదొడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి శివారు కొండపై ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మంజుల దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి భక్తులకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

- ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్

మహబూబాబాద్ రూరల్ : పంట ఉత్పత్తులను విక్రయించేందుకు వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తామని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతుల అవసరాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను గురువారం ఇస్లావత్ సుధాకర్ పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న రైతుల విశ్రాంతి గది భవనం శిథిలావస్థకు చేరిన కారణంగా మార్కెట్ యార్డు ఆవరణలోని ఒక షెడ్డులో రైతులకు ఉపయోగపడే విధంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా త్వరలోనే ఐదు రూపాయల భోజనాన్ని ప్రారంభించే ఆలోచనలో ఉన్నామని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రెటరీ షంషీర్, సూపర్వైజర్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాకుబ్, భీమనాయక్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్

బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి



కేసముద్రం: మాట్లాడుతున్న సింగారపు సతీష్



డోర్నకల్: నియామక పత్రం అందజేస్తున్న లక్ష్మణ్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

నర్సింహులపేట : బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలమంచలి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కొమ్ములవంచలో మాజీ ఎంపీటీసీ దాసరి వీరన్న ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీపై ఉన్న విశ్వాసంతో వివిధ పార్టీల నుంచి చేరికలు జరుగుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర నాయకులు నెహ్రూనాయక్, జిల్లా కార్యదర్శి దర్మారపు వెంకన్న, దార ఇందుభారతి, సతీష్, యాకన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

డోర్నకల్ : నూతనంగా నియమితులైన బూత్ కన్వీనర్లు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్ష్మణ్ కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం పదిమంది బూత్ కన్వీనర్లకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో పార్టీ బలోపేతానికి బూత్ కన్వీనర్లు కృషి చేయాలని కోరారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బానోత్ దేవానాయక్, నాయకులు రెహమాన్, లక్ష్మీనారాయణ, జయరాజ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

కేసముద్రం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ పార్లమెంట్ కో కన్వీనర్ సింగారపు సతీష్ అన్నారు. గురువారం కేసముద్రం విలేజ్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త బీజేపీని బలోపేతం చేయాలన్నారు. జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, గాంతి వెంకట్‌రెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, ఉప్పునూతల రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుప్పట్ల పంపిణీ

నెల్లికుదురు : ఆర్ఎంపీ వెల్ఫేర్ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రావిరాల గ్రామంలో వరద బాధితులు కొంతమందికి గురువారం దుప్పట్లు అందించినట్లు జిల్లా అధ్యక్షుడు రవీంద్రచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల బాధ్యులు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం : సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఇర్సులాపురంలో సీఆర్టీల సమ్మెకు గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. నాయకులు రాజేష్ తో పాటు సీఆర్టీలు పాల్గొన్నారు.

పద్మశాలి యూత్ మండల అధ్యక్షుడిగా కిరణ్

కేసముద్రం : పద్మశాలి యువజన సంఘం మండల అధ్యక్షుడిగా కేసముద్రంస్టేషన్‌కు చెందిన చెలమల్ల కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గురువారం మండల కేంద్రంలో మండల, పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఎన్నిక సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా గడ్డం సంతోష్, ఉపాధ్యక్షులుగా కాముని నరేష్, సురేష్, దాసరి సురేష్, కార్యదర్శులుగా సాత్విక్, శేఖర్, కార్యవర్గ సభ్యులుగా మహేష్, మల్లేశ్ ఎన్నికయ్యారు.

గోదాం ఎదుట కార్మికుల ధర్నా



గార్ల : సివిల్ సప్లయీ, జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతులు, దిగుమతులకు పెంచిన ధరలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక సివిల్ సప్లయీ గోదాం ఎదుట హమాలీ కార్మికులు రెండో రోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

గార్ల : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో గార్లలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని (సెంటర్ ఫర్ ఫైనాన్స్ లిటరసీ) లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ సత్యనారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. గార్ల ఎస్‌బీఐ మేనేజర్ దిలీప్‌కుమార్, జిల్లా సీఎఫ్ఎల్ ఇన్‌చార్జ్ షరీఫ్, రామ్‌సింగ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు హరిప్రసాద్, భాస్కర్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

తొర్రూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్నివర్గాల దాతలు ముందుకు రావాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. గురువారం మండలంలోని పోలెపల్లి ప్రాథమిక పాఠశాలకు దాతల సహకారంతో డ్యూయల్ డెస్క్ బెంచీలు, రెయాన్స్ ప్యాకెట్లు, నూతన సంవత్సర క్యాలెండర్లను అందించారు. కార్యక్రమంలో దాతలు వేణుగోపాల్‌రావు, జగదీశ్వర్‌రావు, సరోజన సంకేత్, సాగర్, హెచ్ఎం బీమా, పాఠశాల కమిటి చైర్మెన్ ఎల్లమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెంచీల అందజేత



కేసముద్రం : మండలంలోని కోరుకొండపల్లి ప్రాథమిక పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన నోఎల్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ ప్రొప్రైటర్ మాంకాల భాస్కర్, టీం సహకారంతో గురువారం రూ.75వేల విలువైన డెస్క్ బెంచీలు, విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన భాస్కర్ తన తండ్రి రాములు జ్ఞాపకార్థంగా పేద విద్యార్థుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుడు నరసయ్య సతీమణి సింగు సత్తెమ్మ మృతిపట్ల అఖిల భారత స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్ గురువారం సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని సత్తెమ్మ నివాసంలో ఆమె చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

సీపీఐ(ఎంఎల్)కి రాజీనామా

చిన్నగూడూరు : సీపీఐ(ఎంఎల్)కి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండపెల్లి వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముసుగు తొలగింపునకు మోక్షం

- రేపు స్వామి వివేకానంద, కొమురం భీమ్ విగ్రహాల ఆవిష్కరణ

సాక్షి స్పందన

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, కొమురం భీమ్ విగ్రహాలను ఈనెల 4న ఆవిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో వివేకానంద సెంటర్‌లో వివేకానంద విగ్రహం, బస్టాండ్ సెంటర్‌లో కొమురం భీమ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాగా ఆవిష్కరణకు నోచుకోవడం లేదని గత నెల 27న ముసుగు తొలగేనా? అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. మున్సిపల్ పాలక మండలి స్పందించి విగ్రహాల ఆవిష్కరణకు ముహూర్తం ఖరారు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఆవిష్కరణకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు.